
కథ

# కరిగిన కల

కె. వెంకటలక్ష్మి



జిల్లా ప్రజాపరిషత్ నుంచి వచ్చిన ఆ ఉత్తర్వులు చదువుకున్న దుంపచెక్కలపాడు మండల ప్రజాపరిషత్ సీనియర్ అసిస్టెంట్ ఎగిరి గంతేశాడు. వెంటనే ఆ ఆనందాన్ని తన సహోద్యోగులతో పంచుకున్నాడు కూడా. 'ఏవోయ్ ప్రభాకరం, రాజేంద్రం! మన ఆఫీసుకు లేడీ టైపిస్టు వస్తోందోయ్' అని అరిచి చెప్పేస్తూ.

వీనుల విందుగా సోకాయి ఆ మాటలు ఆ ఇద్దరికీ. 'ఏవిటీ' అంటూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసం దగ్గరికి ఉరికారు చేతుల్లో ఉన్న ఫైల్స్ విసిరి పారేస్తూ.

'ఏంటి బాబయ్యా నిజంగానే' బోలెడు సంబరపడిపోతూ తనూ ముందుకొచ్చేశాడు మల్లయ్య. ఆ కార్యాలయపు అటెండరు. మామూలు విషయాలైతే (ఫైల్స్ చేరవేయడం అలాంటివన్నమాట) కనీసం కూర్చున్న బల్లమీంచి కదలడం కూడా అపురూపమే ఆయనగారికి.

అప్పటికే శ్రీనివాసంగారి చేతుల్లో ఉన్న ఆర్డర్స్‌ను లాక్కుని చదివేస్తున్నారు ప్రభాకరం, రాజేంద్రం.

శ్రీ/శ్రీమతి/కుమారి వి.విజయరత్నంను టైపిస్టుగా దుంపచెక్కలపాడు మండల....

'శ్రీమతో? కుమారో?' అనుమానం వెలిబుచ్చేడు రాజేంద్రం మధ్యలో ఆగి. 'శ్రీ/శ్రీమతి/కుమారి మూడు పదాలు ఉంచి మన దుంప తెంచే బదులు అక్కర్లేని పదాలేవో కొట్టేస్తే మనకీ అనుమానాలేవీ ఉండేవి కావు గదా! అయినా జిల్లా ప్రజాపరిషత్ వాళ్ళకీ మరీ బద్ధకాలెక్కువలే వ్యాఖ్యానించేడు శ్రీనివాసం.

'కొంపతీసి శ్రీమతేవో?' రాజేంద్రం అన్నాడు.

'లేదులే. మొన్ననే వెళ్ళాను కదా జిల్లా ప్రజాపరిషత్తుకు. ఆ ఎస్టాబ్లిష్‌మెంట్ గుమాస్తా, అదే ఆ రామచంద్రరావు చెప్పాడ్లే ఇక మీ ఆఫీసు వెలిగిపోద్ది గురోయ్ అంటూ దానర్థం ఇదన్నమాట' అన్నాడు ప్రభాకరం. 'అయినా కొత్త అపాయింట్‌మెంట్ కదా కచ్చితంగా పెళ్ళయి ఉండదులే శ్రీనివాసం తేల్చేశాడు.

'అంటే పెళ్ళికాని పిల్లదన్నమాటేగా' తేలిగ్గా నిట్టూర్చాడు మల్లయ్య. మరో రెండేళ్ళలో రిటైరైపోతాడు మానవుడు.

'ఏంటి సంగతి అందరూ ఇక్కడ మూగిపోయారు డి.ఏ. గట్రా పెరిగిందేంటి?' అంటూ లోపలకొచ్చాడు సూర్రావు టీలు పట్టుకు లోపలికి వస్తూ. అతను మరో అటెండరు.

'నీకెప్పుడు డబ్బు రంధే. ఆఫీసుకు కళొస్తోందోయ్ కళ' పెద్దగా నవ్వుతూ సూర్రావు భుజం చరిచాడు మల్లయ్య.

సాయంత్రం ఆనందపుటలల మీదుగా చాలా తొందరగా అయిపోయింది. చాలా హుషారుగా ఇళ్ళకు బయల్దేరారందరూ.

'నమస్కారమండీ' మళ్ళీ వినిపించింది.

తేరుకున్నాడు.

'ఆ... ఆ నమస్కారం కూర్చోండి. మీరూ...'

'నేనండీ టైపిస్టును. ఇక్కడ పోస్టుచేశారండి నన్ను'

'అవునవును. విజయరత్నంగారు కదూ! జాయినింగ్ రిపోర్టిచ్చేయండి. ఎండివోగారు క్యాంపుకెళ్ళారు. వచ్చేస్తారిక. అన్నట్టు కొత్తగా అపాయింట్‌మెంట్ అయ్యారు కదూ! జాయినింగ్ రిపోర్టు రాసిస్తాను సంతకం పెట్టెయ్యండి చాలు' గబగబా ఓ తెల్లకాగితం తీసుకొని జాయినింగ్ రిపోర్టు రాసి ఆమె కందించాడు.

సుతారంగా సంతకం పెట్టి అందించిందామె. ఆ పేపరు అందుకుంటున్న శ్రీనివాసానికి ఆమె చేతి వేలికొనలు తగిలాయి. కరెంటు షాక్కొట్టినట్లయింది. వొళ్ళంతా జల్‌జల్ మంటుంటే వేళ్ళు వణికాయి. పట్టుదొరక్క ఫాను గాలికి కాగితం ఎగిరిపోయింది. ముత్యాలు వెదజల్లుతున్నట్టు నవ్వుతూ ఆ కాగితాన్ని అంది పుచ్చుకొని మళ్ళీ అందించిందామె. కొద్దిగా పైట చెదిరిందా సమయంలో. పరువాలు కనులవిందు చేస్తూంటే కళ్ళు తేలవేశాడు శ్రీనివాసం. 'అబ్బ మీది ఎట్రాక్టివ్ ఫేస్ అండీ' అంది ఆమె హఠాత్తుగా.

'ఏమిటీ' అన్నాడు శ్రీనివాసం ముందుగా ఉలిక్కిపడి ఆ తర్వాత నెమ్మదిగా తేరుకుంటూ. ఆడపిల్లలు అంత ఫాస్టుగా ఉంటారని అతనికి అంతవరకూ తెలియదు మరి.

'అబ్బ! భలే అడుగుతారండీ. మీ ఫేస్‌కట్ ఎప్పుడూ అద్దంలో చూసుకోలేదూ! చిరంజీవి కట్స్ బాగా ఉన్నాయి' చిలిపిగా కళ్ళార్పిందామె.

'నిజం!?' అన్నాడు శ్రీనివాసం ఛాతీ పొంగి పోతూంటే. సమయానికి సహోద్యోగులు లేకపోవడం బాధగా తోచిందతనికి. ప్రభాకరం ట్రెజరీకి, రాజేంద్రం ఆర్‌డివో ఆఫీసుకు పోయారు. మల్లయ్య సెలవు. సూర్రావు టీలకు పోయాడు. వాళ్ళందరూ ఉండీ వాళ్ళందరి ఎదురుగా ఈమె ఈ డైలాగు అని ఉంటే వాళ్ళ ఫేసులు ఎలా మాడిపోయి ఉండేవో ఊహించుకుని చాలా ఆనందించేడు శ్రీనివాసం. అంతలోనే అమ్మాయే అంత ఫాస్టుగా ఉంటే తను మగాడు తనెలా ఉండాలి. లేకపోతే వాజమ్మలా జమ కట్టేయదూ అన్పించింది. అందుకే కాస్త ఫాస్టుగానే ప్రతిస్పందించేడు.

'మీరు మాత్రం. ముఖం విజయశాంతిది. కళ్ళు భానుప్రియవి. కన్రెప్పలు మీనావి. ఆ ముక్కో శ్రీదేవిది. ఆ పెదాలో... అబ్బ భాగ్యశ్రీవే. ఆ గడ్డం మాధురీ దీక్షిత్‌ది. ఆ చూపులు కైపుకళ్ళ సిల్కుస్మితవి. ఆ శంఖంలాంటి మెడ కింద ఆ పరువాల విషయానికొస్తే నగ్మా సౌందర్యాలెందుకూ దండగ' చెంప పేలిపోతుందేమోనని గభాలున కళ్ళు మూసేసుకున్నాడు.

కిలకిల నవ్వు వినిపించేసరికి జారిపోయిన ధైర్యం కూడదీసుకుంటూ కళ్ళు తెరిచాడు.

విజయరత్నం పగలబడి నవ్వుతోంది వొళ్ళంతా కదిలిపోతుండగా జారిపోయిన పైటని కూడా పట్టించుకోకుండా. ఆ లోనెక్ జాకెట్ లోంచి ఆ పూలబంతులు ఎగిరెగిరి పడుతూ కనువిందు చేస్తుండగా కళ్ళు అప్పగించేశాడు శ్రీనివాసం.

అతికష్టం మీద నవ్వాపుకుంది ఆమె. 'అబ్బ మీ మాటలు భలే ఉన్నాయండీ. మీ మాటలు వింటుంటే ఏమేమో అయిపోతున్నాను. అసలు మీ ముఖం చూస్తుంటేనే ముద్దొస్తోంది. ఇక మీ మాటలు వింటూంటే ఇంకేదేదో చేసేయాలన్పిస్తోంది మిమ్మల్ని' అంది కొంటెగా కన్నుగీటుతూ, వయ్యారంగా ఊగుతూ జారిపోయిన పైట సర్దుకోకుండానే.

'అలాగా! మరి ఆ ఏదేదో చేసేయకూడదూ నాకేం అభ్యంతరం లేదు నే రెడీనే' శ్రీనివాసం ఉత్సాహంగా ముందుకు వంగేడు. అలా వంగితే మరీ మంచి 'సీనరీ' కన్పిస్తోంది.

'ఓకే కాని తొందరపడకండి ఈ రాత్రి మరి మీదే' అందామె చిలిపిగా చూస్తూ.

'అంతవరకూ ఒక్క ముద్దు' పెదాలు సాగదీసుకుంటూ అడిగాడు శ్రీనివాసం.

'ఇక సరసాలాపి లేవండి. నలుగురి బిడ్డలకు తండ్రయి కూడా ఏంటీ పోకిరీ మాటలు. అవ్వ పిల్లలు గనుక వింటే పరువు పోయేది' గయ్యిమంటూ దుప్పటి లాగేసింది శ్రీనివాసం సతీమణి మణి తన మొగుడు తనతోనే సరసాలాడుతున్నాడేమోనని పొరపడి.

ముఖం మీద అదిమి పెట్టుకున్న దిండును అది విజయరత్నం ముఖం కాదని గ్రహించి అవతలకి విసిరికొట్టి 'ఆ ఇదంతా కలా' అని సతీమణి వినకుండా గొణుక్కుంటూ లేచాడు శ్రీనివాసం. వింటే కొంప హైదరాబాద్ 86వ నెంబర్ సిటీ బస్సయిపోతుంది.

ఓ గంట తర్వాత హుషారుగా ఆఫీసుకు బయల్దేరాడు శ్రీనివాసం. వచ్చిన కల శుభశకునంలా తోస్తోంది అతనికి. ఆ అమ్మాయి ఇవ్వాళే వచ్చి జాయిన్ అయిపోతే బావుణ్ను అనుకున్నాడు.

సీట్లో కూర్చున్నాడన్న మాటేగాని మనస్సు పనిమీద లగ్నం కావడం లేదు. ఎవరు ఆఫీసులోకి వచ్చినా ఉలిక్కిపడుతున్నాడు. ప్రతి మనిషిని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూస్తున్నాడు. 'ఏంది ఈ బాబు ముఖం మతాబాలా వెలిగిపోతోంది' అనుకున్నాడు మల్లయ్య.

మధ్యాహ్నం 12 గంటలు దాటుతుండగా వచ్చాడో యువకుడు. తిన్నగా శ్రీనివాసం దగ్గరకొచ్చి కూర్చున్నాడు.

'నమస్కారమండీ! నన్ను ఇక్కడ టైపిస్టుగా అపాయింట్ చేశారండీ' అంటూ.

అదోలా చూశాడు శ్రీనివాసం.

ఆనక 'విజయరత్నంగార్ని కదా ఇక్కడ అపాయింట్ చేసింది. మీరు పొరపాట్న పక్కనున్న తుమ్మముక్కలపాలెం మండలాఫీసుకు వెళ్ళబోయి మా ఆఫీసు కొచ్చారేమో ఆర్డర్ సరిగా చూసుకోండి' అన్నాడు చిరాకుగా కలలో ఆ అమ్మాయి రూపం మనస్సును అల్లరి పెడుతుండగా 'వీడెవడ్రా వచ్చాడు పానకంలో పుడకలా' అనుకుంటూ.

'నేనేనండి విజయరత్నాన్ని. వి.విజయరత్నం నా పేరు'

'ఏమిటీ అయితే మీరు... నువ్వు అమ్మాయివి కాదన్నమాట' శ్రీనివాసం ముఖం వేలబడిపోయింది. ఆ తర్వాత నిరాశను తట్టుకోలేక టేబుల్ మీదకు జారిపోయింది.

'ఏటండీ ఏటైపోయింది' టీలు పట్టుకొస్తున్న సూర్రావు.

గాభరాగా శ్రీనివాసం పక్కకు చేరిపోయేడు ప్రభాకరం, మల్లయ్య, రాజేంద్రం మరింత కంగారుగా వచ్చేశారు.

'కన్ఫ్యూజయ్యారా ఏమిటీ? అసలు నా పేరు చూడగానే చాలా మంది అమ్మాయినే అనుకుంటారు. అందులో జిల్లా ప్రజాపరిషత్ ఆర్డర్‌లో శ్రీ/శ్రీమతి/కుమారి అని అనవసరమైన శ్రీమతి/కుమారి పదాలు కొట్టెయ్యకుండా ఉండడంవల్ల మీరు ఇలా కన్ఫ్యూజై ఉంటారు. నాకలవాటే లెండి మరి' నవ్వుతూ చెప్తున్నాడు విజయరత్నం.

ప్రభాకరం, రాజేంద్రం, సూర్రావు, మల్లయ్య మనసు పాడైపోయింది విజయరత్నం మాటలు వినగానే. ఒక్కసారి శూన్యంలోకి చూసి, భావరహితంగా, నిర్వేదంగా ఓ నవ్వు నవ్వి అతికష్టం మీద మామూలై పోయారు. శ్రీనివాసం మాత్రం తేరుకోలేదు. టేబుల్ మీంచి ముఖం లేపనే లేదు.

'ఆఫీసుకు కళొత్తందనుకున్నాను. ఈ ఆఫీసుకీ, మనకీ అంత అదృష్టం కూడానా' విసుగ్గా పోయి బల్లమీద కూలబడి బీడీ వెలిగించాడు మల్లయ్య 'ఏంటీ శ్రీనివాసం బాబు మరీ డల్లయిపోయాడు' అనుకుంటూ.